## మూడవ పాఠం | الدرس الثالث

### నమాజ్ సమయాలు | أوقات الصلاة

★ **జొహ్ర్** నమాజు సమయం: తల నుండి పొద్దు వాలినప్పటి నుండి ప్రతీ వస్తువు నీడ దానంత అయ్యే వరకు.

★ **అస్ర్** నమాజు సమయం: ప్రతీ వస్తువు నీడ దానంత అయినప్పటి నుండి సూర్యాస్తమయం వరకు.

★ **మగ్రిబ్** నమాజు సమయం: సూర్యాస్తమయమైనప్పటి నుండి ఎర్రని కాంతులు కనుమరుగయ్యే వరకు.

★ **ఇషా** నమాజు సమయం: ఎర్రని కాంతులు మరుగైన మరుక్షణం నుండీ అర్ధ రాత్రి వరకు.

★ **ఫజ్ర్** నమాజు సమయం: ఉషోదయము నుండి సూర్యోదయము వరకు.

### నమాజ్ చేయరాని సమయాలు | أوقات النهي

కొన్ని సమయాల్లో నమాజు చేయుట యోగ్యం లేదు. అవి:

1- **ఫజ్ర్** నమాజు తర్వాత నుండి సూర్యోదయం తర్వాత సూర్యుడు బారెడంత పైకి వచ్చే వరకు.

2- మిట్ట మధ్యానం, సూర్యుడు నడి ఆకాశంలో, తలకు సమానంగా ఉన్నప్పుడు. అది పశ్చిమాన వాలే వరకు.

3- **అస్ర్** నమాజు తర్వాత నుండి సూర్యాస్తమయం వరకు.

కాని ఈ సందర్భాల్లో కొన్ని నమాజులు చేయవచ్చు. ఉదాః తహియ్యతుల్ మస్జిద్ (మస్జిదులో ప్రవేశించిన వెంటనే చేయు నమాజ్). జనాజా నమాజ్. సూర్య గ్రహణ నమాజ్. తవాఫ్ సున్నతులు. తహియ్యతుల్ వుజూ లాంటివి.

అలాగే తప్పిపోయిన నమాజులు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఈ హదీసు ఆధారంగా: **"ఎవరైనా ఏదైనా నమాజు మరచిపోతే, లేదా దాని సమయంలో నిద్రపోతే గుర్తు వచ్చిన వెంటనే దాన్ని నెరవేర్చడమే దాని ప్రాయశ్చితం"**. (ముస్లిం 684, బుఖారి 597).

### నమాజ్ చేయరాని స్థలాలు | أماكن لا تصح الصلاة فيها

1- ఖననవాటికః ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారుః **"భూభాగమంతయూ మస్జిదే. స్నానశాల, మరుగుదొడ్లు మరియు ఖనన వాటిక (ఖబరస్తాన్) తప్ప"**. (అబూ దావూద్ 492, తిర్మిజి 317). అయితే జనాజ నమాజు మట్టుకు ఖబరస్తానులో చేయడం ధర్మమే.

అలాగే స్నానాలు చేసే బాత్ రూంలో నమాజు చేయరాదు.

మరుగుదొడ్లో నమాజ్ చేయడం కఠినంగా నిషిద్ధం.

2- సమాధి, గోరీల వైపుః ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పగా నేను విన్నాను అని అబూ మర్సద్ గనవీ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః **"గోరీలు ఎదురుగా ఉండగా నమాజ్ చేయడం గానీ, వాటిపై కూర్చోవటం గానీ చేయకండి"**. (ముస్లిం 972).

3- ఒంటెశాల అంటే ఒంటెలు కట్టే చోటు. అలాగే అశుద్ధ స్థలాల్లో నమాజు చేయరాదు.